

# హైదరాబాద్ వార్త

## వక్ఫ్ బోర్డు భూముల ఆక్రమణపై విచారణ జరిపించాలి

సైఫాబాద్, డిసెంబరు 19 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో ఆక్రమణకు గురైన వక్ఫ్ బోర్డు భూముల ఆక్రమణపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని, బోర్డుకు జుడిషియల్ పవర్స్ కల్పించాలని మైనార్టీ హక్కుల పోరాట ఫోరం జెఎసి ఛైర్మన్ హాజ్రాబేగం రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాష్ట్ర వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌కు వినతి పత్రాన్ని సమర్పించడం జరిగిందని మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె తెలిపారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం, వెల్పూర్ గ్రామంలోని 4 ఎకరాల 12 గుంటల భూమి ఈద్గా స్మశానవాటికను కొంత మంది భూ కబ్జాదారులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ భూమిని రక్షించడానికి వక్ఫ్ బోర్డు అధికారులు సందర్శించడం జరిగిందని, చుట్టు ప్రహరి గోడ నిర్మించడానికి బోర్డు 8 లక్షల రూపాయలను కేటాయించడం జరిగిందని తక్షణమే ప్రహరిగోడ నిర్మించాలని ఆమె అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో సిఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జెఎసి నాయకుడు మహ్మద్ షరీఫ్ కూడా పాల్గొన్నారు.

## టిటిడిలో భగవద్గీత పోటీలు

సైఫాబాద్, డిసెంబరు 19 ప్రభాతవార్త: టిటిడి, హిందూ ధర్మప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం హిమాయత్‌నగర్‌లోని బాలాజీ భవన్ కళ్యాణ మండపంలో గీతా జయంతిని పురస్కరించుకుని భగవద్గీత కంఠస్థ పోటీలు అద్భుతంగా, ఘనంగా జరిగాయి. ఆరు, 7 తరగతుల విభాగంలో ప్రథమ బహుమతి జె.త్రిపుర, ద్వితీయ బహుమతి టి.వంశిదత్త , తృతీయ బహుమతి టి.కాశ్యప్‌లకు దక్కాయి. 8, 9 తరగతుల విభాగంలో ప్రథమ బహుమతి అక్షయకృష్ణ, ద్వితీయ బహుమతి శ్రీస్తుతి పురోహిత్, తృతీయ బహుమతి కె.మనస్వి, సంపూర్ణ భగవద్గీత విభాగంలో 18 ఎళ్ళు లోపు వారిలో ప్రథమ బహుమతి కె.నేహ నందిని, ద్వితీయ బహుమతి నవ్య, తృతీయ బహుమతి భవ్యకు లభించాయి. 18సంవత్సరాలు పైబడిన వారిలో ప్రథమ బహుమతి డి.సంధ్యకి, ద్వితీయ బహుమతి అనురాధ, తృతీయ బహుమతి డి.పద్మజకు దక్కాయి. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా పాల్గొన్న టిటిడి డిప్యూటి ఇవో రమేష్‌కుమార్, లోకల్ అడ్వైజరీ కమిటీ వైస్-ఛైర్మన్ త్రినాధబాబు, సహాయ కార్యనిర్వాహణాధికారి చతుర్వేదల సత్యనారాయణ, ప్రోగ్రాం అసిస్టెంట్ గూడూరు హరినాథ్ విజేతలకు బహుమతలు ప్రదానం చేశారు.

### చోరీకి గురైన సెల్‌ఫోన్‌లు బాధితులకు అందించిన చిక్కడపల్లి సిఐ

చిక్కడపల్లి, డిసెంబరు 19 ప్రభాతవార్త: చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో చోరీ గురైన వారికి చెందిన సెల్‌ఫోన్‌లను స్థానిక ఇన్‌స్పెక్టర్ ఎ.సీతయ్య మంగళవారం అందించారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో చోరీకి గురైన ఏడు సెల్‌ఫోన్‌లను ట్రేస్ చేసి పోగొట్టుకున్న వారికి అందించడంతో బాధితులు సంతోషం వ్యక్తం చేస్తూ సిఐకి ధన్యవాదాలు తెలిపారు.



### డ్రగ్స్ నిర్మూలనపై కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్

డ్రగ్స్ నిర్మూలనపై స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుంది. ఇప్పటికే వరుస దాడులు కొనసాగుతుండటంతో పలువురిని పోలీసులు అరెస్టు చేశారు. ఇక, టిఎస్ఎన్ఏబి, ఎన్‌ఓటీ, టాస్క్ ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగారు. 24 గంటల్లో నాలుగు డ్రగ్స్ గ్యాంగ్స్‌ను అరెస్టు చేశారు. ఇప్పటికే నగరంలో భారీగా గంజాయి, డ్రగ్స్ పట్టుబడుతున్నాయి.

## పబ్స్‌పై పోలీసుల నజర్



హైదరాబాద్, డిసెంబరు 19 ప్రభాతవార్త : న్యూ ఇయర్ వేడుకలు అంటేనే జల్సాలు..ఇక, నగరంలో ఒకటే సందడి ఉండబోతుంది. క్లబ్‌లు, పబ్‌లలో కేరింతలు, తుళ్లింతలతో హోరెత్తిపోతాయి. పార్టీల పేరుతో యువత మత్తులో ఊగిపోతుంది. దీంతో యువత వీకెనెస్‌ను క్యాష్ చేసుకునేందుకు డ్రగ్స్ మాఫియా రెడీ అయింది.ప్రతి ఏటా న్యూ ఇయర్ సెలబ్రేషన్స్ కేంద్రంగా వందల కోట్ల రూపాయల డ్రగ్స్ దందా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌ను డ్రగ్స్ ఫ్రీ సిటీగా మార్చాలని సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించడంతో యాంటి నార్కోటిక్స్ పోలీసులు ప్రత్యేకంగా నజర్ పెట్టారు. నగరంలోని పలు సబ్బులపై తనిఖీలు చేస్తున్నారు.

అయితే, నగరంలోని పలు పబ్స్, క్లబ్స్‌లపై ఇప్పటికే పోలీసులు ఫుల్ ఫోకస్ పెట్టారు. డ్రగ్స్ వినియోగం పబ్స్‌లోనే అత్యధికంగా ఉంది. ఈ డ్రగ్స్ అమ్మకాలకు అడ్డాలుగా మారిన పబ్స్‌లో బడా బాబుల పిల్లలే టార్గెట్‌గా పోలీసులు దృష్టి సారించారు. గోవా, బెంగళూర్, ముంబై నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్‌ను దిగుమతి చేస్తున్నారు. ఇక, పబ్స్‌లో అనుమానిత పదార్థాలపై పోలీసులు సోదాలు చేస్తున్నారు. స్నిపర్ డాగ్స్‌తో వాసన పరిశీలన చేసి డ్రగ్స్ ఆనవాళ్లు పసిగట్టే ప్రయత్నం చేస్తున్నారు. డ్రగ్స్ స్పాట్ టెస్ట్‌లకు పోలీసులు రంగం సిద్ధం చేశారు. డ్రాగర్ డ్రగ్ టెస్ట్ కిట్స్‌ను టిఎస్ఎన్ఏబీ తెప్పిస్తుంది. నోటి లాలా జలంతో డ్రగ్ టెస్ట్‌లు స్పాట్‌లో ఈ పరికరాలతో తేల్చనున్నారు. సినిమా పరిశ్రమపైనా పోలీసులు గట్టి నిఘా పెట్టారు. నూతన సంవత్సర వేడుకలే టార్గెట్‌గా పోలీసులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

ఎస్ఆర్‌నగర్‌లోని సర్వీస్ అపార్టుమెంట్లో డ్రగ్స్ పార్టీని నార్కోటిక్ బ్యూరో భగ్నం చేసింది. బర్త్‌డే పార్టీ కోసం గోవా నుంచి డ్రగ్స్‌ను యువకులు తీసుకొచ్చారు. ఇద్దరు డ్రగ్ పెడ్లర్స్ సహా 33 మంది పోలీసుల అదుపులో ఉన్నారు.ఇక, మరోవైపు జూబ్లీహిల్స్, ఫిలింనగర్‌లో డ్రగ్స్‌ను పోలీసులు పట్టుకున్నారు. రూ.2.28 లక్షలు విలువ చేసే హాష్ అయిల్, 70గ్రాముల చెరాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ విక్రయిస్తున్న ఒక మహిళ సహా ఏడుగురు అరెస్టు కాగా, పరారీలో మరో ఇద్దరు ఉన్నారు. అలాగే, నూతన సంవత్సర వేడుకలకు డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న ముఠాను సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. రాజస్థాన్ నుంచి తీసుకుని వచ్చి హైదరాబాద్‌లో అమ్మాలని చూస్తున్నారు. ఓపిఎం డ్రగ్స్ 3.4 కేజీలు, 45 గ్రాముల పాపీ స్ట్రావ్ పొడర్‌ను స్వాధీనం చేసుకున్నారు.శశిపాల్ బిష్‌నాయ్, మదన్‌లాల్ బిష్ బాయ్ అనే ఇద్దరు నిందితులను పోలీసులు అదులోకి తీసుకున్నారు. అలాగే చైతన్యపురిలో డ్రగ్స్ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పరారీలో డ్రగ్ పేడ్లర్ ఉన్నారు. నిందితులు భీమావరంకి చెందిన కునపరాజు, లక్ష్మీనరసింహ రాజుతో పాటు జీడిమెట్లకు చెందిన జలిమ్, శ్యామ్‌రాయ్‌గా గుర్తించారు. ఇక, గోవాకు చెందిన డ్రగ్ పెడ్లర్ హాబీబ్ అనే వ్యక్తి కూడా పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి 5 గ్రాముల ఎమ్డీఎంఏ డ్రగ్స్, ఎల్ఎస్టీ, బిఎన్‌ఓటీఎస్4 స్వాధీనం చేసుకోగా, నగరంలో డ్రగ్స్ నిర్మూలన కోసం పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేస్తున్నారు.

## మళ్లీ మొదలు కానుందా..?

### రూపం మార్చుకుని మళ్లీ వచ్చేసిన కరోనా
### కరోనా కొత్త వేరియంట్‌తో అప్రమత్తమైన గాంధీ ఆస్పత్రి





హైదరాబాద్, డిసెంబరు 19 ప్రభాతవార్త : కరోనా వైరస్ మహమ్మారి మళ్లీ విజృంభిస్తోంది. కొవిడ్ కేసుల సంఖ్య మళ్లీ పెరుగుతోంది. తప్పిపోయిందీ అనుకున్న కరోనా ముప్పు.. రూపం మార్చుకుని మళ్లీ వచ్చేసింది. కరోనా కొత్త పేరియంట్ జేఎన్.1 విజృంభిస్తోంది. కరోనా కొత్త వేరియంట్ కేసులు దేశవ్యాప్తంగా పెరుగుతుండటంతో తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఈ నేపథ్యంలో కరోనా చికిత్సలకు నోడల్ కేంద్రంగా ఉన్న గాంధీ ఆస్పత్రిలో అన్ని ఏర్పాట్లను సిద్ధం చేసింది. కరోనా పేషేంట్స్‌కు చికిత్స అందించేందుకు తాము సిద్దంగా ఉన్నాయని సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు తెలిపారు. సాధారణ రోగుల కోసం 30 పడకలు, గర్భిణుల కోసం మరో 20 ప్రత్యేకంగా కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటివరకు తెలంగాణలో కొత్త వేరియెంట్ కేసులు బయటపడలేదని రాజారావు చెప్పారు. తాము అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నామన్నారు. తగినన్ని వ్యాధినిర్ధారణ పరీక్షలకు కావాల్సిన కిట్స్, చికిత్సకు అవసరమైన మందులు ఆక్సిజన్ అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రజలు ఆందోళన చెందవద్దని, చలికాలం నేపథ్యంలో శ్వాసకోశ సంభందించిన వ్యాధులు పెరిగే విషయాన్ని గమనించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జ్వరం, జలుబు, ముక్కు కారడం, గొంతు నొప్పి, తలనొప్పి వంటి లక్షణాలు కొత్త వేరియంట్‌లో ఉంటాయి. కొంత మందిలో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తనున్నట్లు వైద్య అధికారులు చెబుతున్నారు. కేసులు పెరిగితే మళ్లీ టెస్టులు చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా వృద్దులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. రాబోయే పండుగల సీజన్ దృష్ట్యా ప్రజలంతా శ్వాసకోశ పరిశుభ్రతను పాటించాలి, అవసరమైన చోట్ల మాస్కులను ధరించాలని సూచించారు. గుంపుల్లోకి వెళ్లకపోవడం మంచిదని సూచిస్తున్నారు. తరచూ చేతులు శుభ్రం చేసుకోవాలని, శానిటైజ్ చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.ముఖ్యంగా కేరళ రాష్ట్రంలో ఈనెల 8న కొవిడ్ కొత్త వేరియంట్ జేఎన్ 1 వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

గత 24 గంటల వ్యవధిలో కొత్తగా 260 కేసులు నమోదు కాగా, ఐదుగురు మృతి చెందారు. కేరళలో నలుగురు మరణించగా, ఉత్తరప్రదేశ్‌లో ఒకరు చనిపోయారు. కేరళలో కొత్త వేరియంట్ జేఎన్1 బయట పడిన నేపథ్యంలో తాజా పరిణామాలు దేశ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కరోనా కేసుల పెరుగుదల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అలర్ట్ అయింది. రాష్ట్రాలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కానీ కొవిడ్ పూర్తిగా తగ్గుముఖం పట్టిందని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అనేక మందులు, చికిత్స విధానాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ప్రజల్లోనూ ఇక ఏమీ కాదులే అనే ధోరణితో వ్యవహరిస్తున్నారు. కరోనా నిబంధనల్ని పాటించకపోవడం తోపాటు.. చికిత్స విషయంలోనూ నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇది సమస్య తీవ్రమయ్యే పరిస్థితికి దారితీసి.. ఆస్పత్రిలో చేరేదాకా వెళ్తుందని వైద్యులు పేర్కొంటున్నారు.

### వృత్తి విద్యా ఉపాధ్యాయులకు ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం
## పాత పద్ధతిలోనే పెన్షన్ అమలు చేయాలి



వెంకటేశంకు ట్రిబ్యునల్ తీర్పు కాపీలను అందజేస్తున్న అగస్టీన్

సైఫాబాద్, డిసెంబరు 19 ప్రభాతవార్త: రాష్ట్ర విద్యా శాఖ నూతన ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమితులైన బుర్ర వెంకటేశంకు రాష్ట్ర వృత్తి విద్యా ఉపాధ్యాయ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపింది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.అగస్టీన్ ఆధ్వర్యంలో ఒక ప్రతినిధి బృందం మంగళవారం సచివాలయంలో బుర్ర వెంకటేశంను కలిసి అభినందించి ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా అగస్టీన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న, పనిచేసి రిటైర్‌యిన 270 మంది వొకేషనల్/ క్రాఫ్ట్ఇన్‌స్ట్రక్టర్‌ల యొక్క మొదటి నియామకపు తేదీని పరిగణలోకి తీసుకుని పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీకి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ 2015, డిసెంబరు 18వ తేదీన ఇచ్చిన తీర్పును తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం సమర్థిస్తూ గత ఆగస్టు 11వ తేదీన ఇచ్చిన తీర్పును అమలు చేసి తమ జీవితాల్లో వెలుగును నింపి అదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆ తీర్పు కాపీలను కూడా ఆయన ప్రిన్సిపల్ సెక్రటరీకి అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ ఈ అంశాలను పరిశీలించి తగిన న్యాయం చేస్తానని చెప్పారు. ప్రతినిధి బృందంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.నరసింహారెడ్డి, కోశాధికారి లక్ష్మణ్‌రావు, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌రావు, పగడాల నరసింహారావు, అమీరుద్దీన్ తదితరులు ఉన్నారు.

## ఉత్సాహంగా వీల్ చైర్ సల్సా



వీల్ చైర్‌లో సల్సా స్టెప్పులు వేస్తున్న బాధితులు

గచ్చిబౌలి, డిసెంబరు 19 ప్రభాతవార్త : ఫిజియోథెరపీ బాధితుల డిప్రెషన్‌ను దూరం చేసేందుకు గచ్చిబౌలిలో వినూత్నంగా ఏర్పాటు చేసిన వీల్ చైర్ సల్సా ఆకట్టుకుంది. ఫిజియోథెరపీ అంటే క్రమం తప్పకుండా ఒకే విధమైన చికిత్స పద్దతులతో డిప్రెషన్‌కు గురయ్యే బాధితుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు గచ్చిబౌలిలోని ఉచ్చ్వాస్ ట్రాన్సిషనల్ కేర్ సంస్థ వీల్‌చైర్ సల్సా పేరుతో వినూత్న కార్యక్రమాన్ని మంగళవారం ఏర్పాటు చేసింది. క్రిస్టమస్ పర్వదిన వేడుకలను పురస్కరించుకొని ఫిజియోథెరపీ బాధితుల కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, పలువురు బాధితులు ఉత్సాహంగా వీర్‌చైర్‌లో ఉండి సల్సా స్టెప్పులు వేశారు. తమ జీవితాల్లో ఫిజియోథెరపీ తీసుకువచ్చే సానుకూల మార్పులను గుర్తించే విధంగా, బాధితులతో డాన్సులను ఆస్వాదింజచేసే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాన్సులను మిలితం చేసిన ఫిజియోథెరపీతో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచ్చ్వాస్ ట్రాన్సిషనల్ కేర్ డైరెక్టర్ డాక్టర్ విజయ్ బత్తిన మాట్లాడుతూ వీల్ చైర్ సల్సా కార్యక్రమంలో భాగంగా రోగులు ధరించే నీలం రంగు దుస్తులు కాకుండా తమకు ఇష్టమైన దుస్తులను వేసి, తమకు నచ్చిన, వచ్చిన సల్సా స్టెప్పులు వేసి ఆనందించే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. బ్రెయిన్ స్ట్రోక్, తలకు గాయం, స్పైనల్ కార్డ్ గాయంతో కోలుకుంటున్న దాదాపు 10మంది రోగులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.



మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన దాసరి హరిచందనకు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ కమీషనర్ శరత్‌చంద్ర తదితరులు

## బిఎంఎస్ ఆటో యూనియన్ ధర్నా



ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌బస్‌భవన్ ముందుధర్నా చేస్తున్న బిఎంఎస్ ఆటో యూనియన్ నేతలు

చిక్కడపల్లి, డిసెంబరు 19 ప్రభాతవార్త: ఆటో డ్రైవర్ల ఉపాధిని రాష్ట్ర ప్రభుత్వం కాపాడాలని, మహాలక్ష్మి పథకాన్ని నిరసిస్తూ బిఎంఎస్ అనుబంధ తెలంగాణ స్టేట్ ఆటో అండ్ టాక్సీ డ్రైవర్స్‌యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని బస్‌భవన్ ముందు పెద్దఎత్తున ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించింది. భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు మజ్దూర్ మహాసంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రభుత్వం ఆటో సంఘాలతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో మహిళలకు ఆర్టీసిలో ఉచిత ప్రయాణం ప్రకటించడం ద్వారా మహిళలు సంతోషంగా ఉండవచ్చు కాని ఆటోడ్రైవర్ల కుటుంబాల మహిళలు మాత్రం సంతోషంగా లేరని అన్నారు. రాష్ట్రంలో అన్ని జిల్లా, మండల కేంద్రాల నుంచి వివిధ గ్రామాలకు, నగరాలలో వివిధ ప్రాంతాలకు ఆటోలలో ప్రయాణించే వారు 70శాతం మహిళలేనని, ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఆటోడ్రైవర్లు ఉపాధి కోల్పోయారన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆటోడ్రైవర్లను నిర్లక్ష్యం చేస్తూ ఓలా, ఊబర్, రాపిడి బైక్‌లను ప్రోత్సహిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆటోడ్రైవర్ల ఉపాధిని దెబ్బతీసిందన్నారు. ఉచిత ప్రయాణం ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమాన్ని పునరాలోచించాలని కోరారు. ఈ ఆందోళన కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నందకిషోర్, బి.పెంటయ్యగౌడ్, గ్రేటర్ ఆటో యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ మూదిరాజ్, ఎస్.కిషన్, స్టేట్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహాసంఘ్ ఉపాధ్యక్షుడు ఎండి.హాబీబ్, ప్రధాన కార్యదర్శి వి.సమ్మయ్య యాదవ్, సంఘటన కార్యదర్శి ఇ.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

### విదేశాలకు వెళ్లే ఇష్టం లేక బెంగతో
## విద్యార్థిని బలవన్మరణం

తార్నాక, డిసెంబర్ 19 ప్రభాతవార్త: విదేశాలకు వెళ్లే ఇష్టం లేక బెంగతో ఓ విద్యార్థిని ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషాదకర సంఘటన ఉస్మానియా యూని వర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబందించి పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హబ్సిగూడ స్ట్రీట్ నెం.8లో ఉండే జయసింహ్మా కుమార్తె హంపి భవాణి (21) బిఫార్మసీ చదివింది. ఇటీవలే చదువుపూర్తి చేసుకుంది. ఉన్నత చదువుల కోసం ఆమె ఆస్ట్రేలియాకు వెల్లవలసి ఉంది. తల్లి,తండ్రులను విడిచిపెట్టి ఆమెకు ఆస్ట్రేలియా వెళ్లడం ఇష్టంలేక ఇటీవల బెంగపెట్టుకుంది. ఈ క్రమంలో ఆమె తన గదిలో రాత్రి అందరు పడుకున్న సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఉదయం తన గది నుంచి ఎంతకు హంపి బయటకు రాకపోవ డంతో అనుమానంతో కుటుంభ సభ్యులు తలుపులు తెరిచి చూడగా హంపి ఫ్యాన్‌కు ఉరివేసుకొని వేలాడుతూ కనిపించిం ది. దీంతో మృతురాలి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## విధులతో పాటు క్రీడా రంగాల్లో ప్రతిభ కనబర్చాలి : ఈడి వెంకటేశ్వర్లు

కంటోన్మెంట్,డిసెంబర్ 19 ప్రభాతవార్త: ఆర్టీసి ఉద్యోగులు క్రమశిక్షణతో తమ తమ విధులు నిర్వహించడంతో పాటు పలు క్రీడా రంగాల్లో ప్రతిభకనబర్చి సమాజాభివృద్ధి కోసం పాటుపడాలని ఆర్టీసి గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం జూబ్లీ బస్టేషన్ సమీపంలోని పికెట్ గార్డెన్‌లో ఆర్టీసి సికింద్రాబాద్ రీజినల్ లేవల్ వివిధ డిపోల్లో పనిచేస్తున్న ర్టీసి ఉద్యోగులు క్రమశిక్షణతో తమ తమ విధులు నిర్వహించడంతో పాటు పలు ఆర్టీసి ఉద్యోగులకు నిర్వహించిన క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. ఖోఖో, కబడ్డీ ఫైనల్ పోటీల్లో పాల్గొన్న కంటోన్మెంట్, హాకీంపేట్, కుషాయిగూడ, ఉప్పల్,చెంగిచెర్ల డిపోలకు చెందిన ఉద్యోగులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ ఖుస్రోషాఖాన్, డిప్యూటీ ఆర్ఎం.లు బీమ్ రెడ్డి, సురేశ్ చౌహాన్, వెంకట్ రెడ్డి, ఆయా డిపోల మేనేజర్లు ఎల్.రాంమోహన్, భవభూతి, చంద్రకాంత్, శ్రీనివాస్, కవిత, లక్ష్మిధర్మ పాల్గొన్నారు.

### ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో
## రియల్టర్ దారుణ హత్య



హత్యకు గురైన ఖాద్రి(ఫైల్‌ఫొటో)

సైదాబాద్, డిసెంబరు 19 ప్రభాతవార్త: ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి దారుణ హత్యకు గురయ్యాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంతోష్‌నగర్ రాంచంద్ర నగర్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారి తారిక్ అలీ ఖాద్రి (36) తన కుటుంబంతో నివాసముంటున్నాడు. సోమవారం తెల్లవారుఝామున తన ఇంటి ముందున్న అరుగుపై కూర్చున్నాడు. ఇదే సమయంలో అక్కడకు కొంతమంది ద్విచక్ర వాహనాలపై వచ్చారు. ద్విచక్రవాహనాలపై వచ్చిన వారంతా ఒక్కసారిగా ఖాద్రిపై దాడికి పాల్పడ్డారు. రోడ్డు పక్కనే ఉన్న కారు వెనుకకు తప్పించుకుని పరుగెత్తినప్పటికి వారంతా కారును చుట్టు ముట్టి విచక్షణా రహితంగా ఖాద్రిపై దాడి చేశారు. తమతో తెచ్చుకున్న డాగర్లు, కొడవళ్లతో దాడి చేశారు. దాడి చేసిన అనంతరం నిందితులను అక్కడ నుంచి పరారయ్యారు. విచక్షణా రహితంగా దాడి చేయడంతో ఖాద్రి సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. హత్య సమాచారం అందుకున్న సౌత్ ఈస్ట్ జోన్ డిసిపి మనోహర్‌తో పాటు చాంద్రాయణగుట్ట ఎసిపి, ఐఎస్ సదన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఖాద్రిపై జరిగిన దాడి అంతా స్థానికంగా ఉన్న సిసి కెమరాల్లో రికార్డు కావడంతో సిసి పుటేజి ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చేపట్టారు. హత్యకు గురైన వ్యక్తి రియల్ ఎస్టేట్ వ్యాపారి కావడంతో వ్యాపారంలో ఏమైనా తగాదాలతో హత్య జరిగిందా లేక మరేదైనా కారణాలు ఉన్నాయా అనేకోణంలో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు.



ప్రజా దర్బార్‌లో పాల్గొన్న ప్రజలు, ఇన్‌సెట్‌లో ఓ వికలాంగురాలు





హైదరాబాద్‌లోని బేగంపేట్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన శతాబ్ది ఉత్సవాలల్లో పాల్గొన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ తమిళిసై, సాంస్కృతి కార్యక్రమంలో చిన్నారులు

## ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**



బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

కంటోన్మెంట్, డిసెంబర్ 19 ప్రభాతవార్త: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేని పక్షంలో ప్రజల పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తామని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసంలో నియోజకవర్గం పరిధిలోని బిఆర్ఎస్ ముఖ్య కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ ఆచరణ సాధ్యం కానీ హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చారని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. ప్రభుత్వంలో లేమని బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు అధైర్యపడవద్దన్నారు. అన్నింటికి తాను ఉన్నానని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎసికింద్రాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, కార్పొరేటర్లు హేమలత, మహేశ్వరీ, మాజీ కారో ్పరేటర్లు ఆకులరూప, అత్తెల్లి అరుణ శ్రీనివాస్ గౌడ్, శేషకుమారి, కిరణ్మయి, బిఆర్ఎస్ నేతలు ఆకుల హరిక్రిష్ణ, బాల్‌రెడ్డి, శ్రీనివాసస్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, నరేందర్, సంతోష్, నాగులు, లక్ష్మీపతి, మహేశ్, ప్రవీణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించడమే ధ్యేయం : ఎమ్మెల్యే లాస్య



కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యను అభినందిస్తున్న పలు బస్తీల నేతలు

కంటోన్మెంట్,డిసెంబర్ 19 ప్రభాతవార్త: కంటోన్మెంట్ నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను దశల వారిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే లాస్య నందిత తెలిపారు. మంగళవారం కంటోన్మె ంట్ నియోజకవర్గానికి చెందిన వివిధ కాలనీలు, బస్తీలకు చెందిన ప్రతినిధులు, బిఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే లాస్యను మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. మోండా డివిజన్‌లోని వెస్ట్ మారేడ్‌పల్లిలో నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లల్లో అర్హులైన లబ్ధిదారులకు ఫ్లాట్లు కెటాయించాలని స్థానిక లబ్ధిదారులు విజ్ఞప్తి చేశారు. ఈ నెల 22న జింఖానా గ్రౌండ్‌లో జరగనున్న జిల్లా స్థాయి యూత్ ఫెస్టివల్ వేడుకలకు హాజరు కావాలని జిల్లా క్రీడాధికారి విజ్ఞప్తి చేశారు. అదే విధంగా శివాజీ నగర్‌లో ప్రసిద్ధిగాంచిన శ్రీ పెరుమాల్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ధనుర్మాస అధ్యాయన ఉత్ స్వాలకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి వి.ఆర్.ఆసుపత్రి ఎండి నంద కిషోర్, మాజీ బోర్డు సభ్యురాలు అనితా ప్రభాకర్, బిఆర్ఎస్ నాయకులు పనస సంతోష్, జగ్గం మహేశ్, కేబి.శంకర్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్, రమేశ్ పాల్గొన్నారు.

## ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**డిప్యూటీ సిఎంకు ఉపకులాల హక్కుల పోరాట సమితి వినతి**



బట్టివిక్రమార్కను కలిసి బైరి వెంకటేశం మోచి, నాగయ్య, తులసీదాస్

హైదరాబాద్, డిసెంబరు 19,ప్రభాత వార్త: రాష్ట్రంలో ఎస్సీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టివిక్రమార్కను ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు బైరి వెంకటేశం మోచి కోరారు. ఈమేరకు మంగళశారం సచివాలయంలో బట్టిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా ఎస్సీ ఉపకులాలకు రాష్ట్రంలో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం వెంకటేష్‌మోచీ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఎస్సీ ఉపకులాలను పూర్తిగా విస్మరించి అన్యాయం చేసినందున ఈఅసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీకి సంపూర్ణ మద్దతు ప్రటించిన విషయాన్ని గుర్తుచేశారు. కావున కాంగ్రేస్‌పార్టీ ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటుకు హామీఇచ్చిన నేపథ్యంలో వెంటనే ఉపకులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు మటపతి నాగయ్యస్వామి, తులసీదాస్ గైక్వాడ్ మాంగ్, బొబ్బిలి రమేష్ ,మాల జంగం, గడ్డం యాదగిరి , ఔషాదం రవీందర్, పస్తంకుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలను అరికట్టండి

**ప్రజావాణిలో సీపీఐ మండల కార్యదర్శి శ్రీనివాస్ పిర్యాదు**



వినతిపత్రాన్ని అందజేస్తున్న సీపీఐ నాయకులు

నిజాంపేట్, డిసెంబర్ 19, ప్రభాతవార్త : నిజాంపేట్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని సర్వే నెంబర్ 191 అయ్యప్ప దేవాలయం వద్ద, ఎన్టీఆర్ నగర్, నిజాంపేట్ సర్వే నెంబర్ 82లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు, అక్రమ లేఅవుట్ గురించి ప్రజావాణిలో సీపీఐ మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పిర్యాదు చేయడం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ బాచుపల్లి మండల పరిధిలోని ఎక్కడ చూసినా కబ్జాల మయంగా మారాయన్నారు. ప్రతీరోజు ఒక దగ్గర కబ్జాలు అవుతూనే ఉన్నాయని అన్నారు. నిజాంపేట్ సర్వే నెంబర్ 82 గతంలో రెవన్యూ అధికారులు పార్క్ కోసం మున్సిపల్‌కి కేటాయించారు. దానిలో కొంత స్థలం కబ్జాదారులు దారి మళ్ళించి కబ్జా చేశారనా న్నరు. ఎన్నికల సమయంలో సర్వే నెంబర్ 191లో అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద చేసిన కబ్జాలపై ఇప్పడి వరకు రెవెన్యూ అధికారులు గానీ మున్సిపల్ అధికారులు కానీ చర్యలు తీసుకోలేదని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు ఇ.ఉమా మహేష్, హరినాథ్‌రావు, రచ్చ కిషన్, ప్రవీణ్, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి వి.శ్రీనివాస్, మండల సహాయ కార్యదర్శి దుర్గయ్య, మండల నాయకులు ఇమామ్, రాజు, ఐలయ్య, చారి తదితరులు పాల్గొన్నారు.

## విఎన్ఆర్ విజెఐఈటిలో ఆరంభమైన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2023 తుది పోటీ

నిజాంపేట్, డిసెంబర్ 19, ప్రభాతవార్త : ప్రగతినగర్‌లోని విఎన్ఆర్ విజా ్ఞనజ్యోతి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2023 సాఫ్ట్‌వేర్ ఎడిషన్ గ్రాండ్ ఫినాలే మంగళవారం ప్రారంభమైంది. నోడల్ సెంటర్‌గా ఉన్న కళాశాల ప్రాంగణంలో 36 గంటల పాటు నిర్విరామంగా జరగనున్న ఈ కార్యక్రమ ప్రారంభానికి ఏఐసిటిఈ తరపున నోడల్ సెంటర్ హెడ్ యోగేశ్ వాధ్వానీ, నోడల్ సెంటర్ సమన్వయకర్త శివ సిరిపోలు అతిథులుగానూ, జల్‌శక్తి మంత్రిత్వ శాఖలోని నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగకి చెందిన షియూష్ గుప్తాతో సహ రూర్కీలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హైడ్రాలజీ, సెంట్రల్ గ్రౌండ్‌వాటర్ బోర్డ్, సెంట్రల్ వాటర్ కమీషన్‌లకి చెందిన పలువురు నిపుణులు పాల్గొన్నారు. ఈ హ్యాకథాన్‌లో జల్‌శక్తి మంత్రిత్వశాఖకి సంబంధించిన సమస్యలపై సమస్యలకి పరిష్కారాలు రూపొందించటానికి దేశం నలుమూలల నుంచి సుమారు 150 మంది విద్యార్థినీ విద్యార్థులు 25 జట్లుగా పాల్గొన్నారని నోడల్ సెంటర్ ఇన్‌ఛార్జ్, సిఎస్ఈ -ఏఐఎంఎల్ లండ్ లాట్ అసోసియేట్ ప్రొఫెసర్ డా.ఎ.కౌసర్ నిఖత్, సిఎస్ఈ-డిఎస్‌సిఎస్ అండ్ ఏఐడి విభాగానికి చెందిన సహాయాచార్యులు, హ్యాకథాన్ సమన్వకర్త డా.ఎ.సునంద తెలిపారు.

## న్యాయం చేయాలని ప్రజావాణిలో 5గురు మంత్రులను వేడుకున్న సౌజ్ బాధితులు

సైఫాబాద్, డిసెంబరు 19 ప్రభాతవార్త: గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఆశాస్త్రీయమైన జివో నెంబరు 317 మూలంగా ఉద్యోగసు ్తలైన భార ్య, భర్తలు వివిధ జిల్లాలకు విసిరి వేయబడ్డారని, భర్త ఒక జిల్లాలో, భార్య మరొక జిల్లాలో, పిల్లలు ఇంకొక జిల్లాలో, వృద్దులైన తల్లిదండ్రులు ఇంకొకచోట ఉండటం వల్ల కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నామైందని స్పౌజ్ బాధితులు మంగళవారం ప్రజావాణిలో రాష్ట్ర మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, డి.శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, విద్యాశాఖ కార్యదర్శి బుర్ర వెంకటేశంకు ఆందోళన వ్యక్తం చేశారు. గత రెండు సంవత్సరాల నుంచి బాధితులు ధర్నాలు, ర్యాలీలు, భార్యపిల్లలతో రోడ్డెక్కిన గత ప్రభుత్వం కనికరించలేదని, ముఖ్యంగా మహిళలు 85 శాతం ఇబ్బందులకు గురైనారని వారు మంత్రుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. 2023 జనవరిలో నాటి ప్రభుత్వం కేవలం 615 స్పౌజ్ బదిలీలు మాత్రమే జరిపిందని, ఇంకా 1500 స్పౌజ్ బదిలీలు పెండింగ్‌లోనే ఉన్నాయని ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళి సాధ్యమైనంత త్వరగా తమకు బదిలీలు జరిపించాలని వారు మంత్రులను వేడుకున్నారు. శాసన మండలిలో జివో నెంబరు 317, స్పౌజ్ బదిలీలు, ఇతర విద్యా శాఖ సమస్యల విషయంలో త్వరలోనే ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి సానుకూలంగా నిర్ణయిం తీసుకుంటానని, సిఎం రేవంత్‌రెడ్డి చెప్పడం చాలా సంతోషకరమని, సాధ్యమైనంత త్వరగా తమ సమస్యను పరిష్కారించాలని వారు విజ్ఞప్తి చేశారు. మంత్రులను కలిసిన వారిలో స్పౌజ్ ఫోరం అధ్యక్షుడు ఎస్.వివేక్‌తోపాటు త్రివేణి, మమత, సౌజన్య, నరేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## కేజ్రీవాల్‌పై ఈడి సమన్లకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన




అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న ఆప్ కార్యకర్తలు

సైఫాబాద్, డిసెంబరు 19 ప్రభాతవార్త: కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్న బిజెపి ఆదేశానుసారం ఈడి ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సమన్లు జారీచేసి సిగ్గులేని కుట్రకు పాల్పడుతున్నదని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. కేజ్రీవాల్‌పై నకిలీ, బోగస్, చట్టంలో నిలకడలేని కేసులు పెట్టి ఢిల్లీ ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నాలు చేస్తే తాట తీస్తామని ఆయన హెచ్చరించారు. అరవింద్ కేజ్రీవాల్‌కు జారీ చేసిన ఈడి సమన్లు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటి ఆధ్వర్యంలో ఆనేక మంది కార్యకర్తలు ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్బంగా సుధాకర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న మిడతల దాడికి భయపడే ప్రసక్తి లేదని నిజాయితీకి మారుపేరైన కేజ్రీవాల్‌కు ఈడి జారీ చేసిన సమన్లను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ప్రదర్శనలో పార్టీ నాయకులు బుర్ర రాముగౌడ్, మాజీద్, హేమా జిల్లోజు, మౌనిక, మంజుల, విజయ్‌పవర్ తదితరులు పాల్గొన్నారు.

## సరికొత్త టెక్నాలజీతో క్యాన్సర్ చికిత్స

గచ్చిబౌలి, డిసెంబరు 19 ప్రభాతవార్త : క్యాన్సర్ చికిత్స కోసం అందుబాటులో ఉన్న అదునాతన టెక్నాలజీని ఉపయోగించి రోగుల ప్రాణాలను కాపాడుతున్నారు నగర వైద్యులు. బ్రెయిన్ ట్యూమర్ క్యాన్సర్‌తో బాధపడుతున్న యువతికి డెండ్రీటిక్ థెరపీ టెక్నాలజీతో వైద్య సేవలు అందించిన ఓ ఆసుపత్రి వైద్యులు, ఈ టెక్నాలజీతో వైద్య సేవలు అందించిన మొదటి వైద్యులుగా తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. ఈమేరకు అదునాతన టెక్నాలజీతో చేపట్టిన క్యాన్సర్ వైద్య చికిత్సపై మంగళవారం గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆసుపత్రి చైర్మన్ గురు ఎన్.రెడ్డి, సెల్యూలార్ థెరపీ డైరెక్టర్ డాక్టర్ ఎవిఎస్ సురేష్‌లు పాల్గొని వివరాలు వెల్లడించారు. బ్రెయిన్ ట్యూమర్ క్యాన్సర్‌తో బాధపడుతున్న యువతి ఆసుపత్రిలో చేరిందని, వ్యాధిని పరిశీలించిన వైద్యుల బృందం యువతి జన్యుపరివర్తినలో వచ్చిన మార్పుల కారణంగా క్యాన్సర్ వ్యాధి బారిన పడినట్టు గుర్తించినట్లు తెలిపారు. దీంతో యువతి తల్లిదండ్రులతో డెండ్రీటిక్ సెల్ థెరపీ విషయమై చర్చించి వారిని ఒప్పించామన్నారు. ఈ విధానం ద్వారా యువతి రోగనిరోదక కణాలను, యుతిలో క్యాన్సర్ సోకిన కణాలను తీసుకొని, రెగ్యులేటరీ పద్దతిలో ఓ వ్యాక్సిన్‌ను తయారు చేశామన్నారు. సదరు వ్యాక్సిన్‌ను యువతికి ఇవ్వడం ద్వారా తాము ఊహించిన విధంగా మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపారు. సమావేశంలో కాంటినెంటల్ వైద్యులు డాక్టర్ అజయ్‌రెడ్డి, డాక్టర్ జయనాథ్, డాక్టర్ అనురాధరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అభిమానంతోనే వరుసగా నాలుగో సారి విజయం



రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న మణికొండలోని గేటెడ్ కమ్యూనిటీ కాలనీల ప్రతినిధుల బృందం

నార్సింగి, డిసెంబర్ 19 ప్రభాతవార్త : వరుసగా నాలుగు మార్లు రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన తొలుకంటి ప్రకాశ్‌గౌడ్‌కు శుభాకాంక్షల వెల్లువ కొనసాగుతుంది. మంగళవారం మణికొండ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, బిఆర్ఎస్ అధ్యక్షులు బుద్దోలు శ్రీరాములుల నాయకత్వంలో మైహోం అవతార్, హాల్‌మార్క్ వీసీనియ అసోసియేషన్ ప్రతినిధుల బృందం ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఇంటికెళ్లి పుష్పగుచ్చాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజల అభిమానంతోనే నేను వరుసగా నాలుగో సారి విజయం సాధించానన్నారు. నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ, వారి ఇబ్బందులను దూరం చేయడం వల్లనే నా ప్రత్యర్థులు నాపై ఎన్ని అసత్య ఆరోపణలు చేసినా ప్రజలు నాపై పూర్తి విశ్వాసం ఉంచి గెలిపించుకున్నారన్నారు. ప్రజల మధ్యన ఉండి సేవ చేసే వారికే ప్రజలు పట్టం కడుతారనేందుకు నేనే నిదర్శనమన్నారు. కౌన్సిలర్లు, కార్పోరేటర్లు అందరూ నిరంతరం ప్రజల మధ్యనే ఉండాలని, ప్రజలెదుర్కొంటున్న సమస్యలను వేగంగా పరిష్కరించాలని ప్రకాశ్‌గౌడ్ సూచించారు. ఎన్నికలలో గెలుపు, ఓటములు నాయకుల నడవడిక, స్పందనలపైనే ఆధారపడి ఉంటాయన్నారు. ఇప్పుడున్న ప్రజా ప్రతినిధులంతా మళ్లీ గెలువాలంటే ప్రజల మధ్యనే ఉండాలని సూచనలు చేశారు. బస్తీలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్టుమెంట్లు, గ్రామాలలో, మున్సిపాలిటీలలో ఎక్కడ సమస్య వచ్చినా వెంటనే సంబంధిత అధికారులను అక్కడికి తీసుకెళ్లి పరిష్కరించానని, అందుకే ఈ దఫా ఆయా వర్గాలకు చెందిన ఓట్లు అధికశాతం నాకే పడ్డాయని ఎమ్మెల్యే తెలిపారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద

## ఆడపడుచులకు అన్నగా పాలనను కొనసాగించిన నేత కెసిఆర్

**ఎమ్మెల్యే కెపి వివేకానంద**

పేట్‌బషీరాబాద్, డిసెంబర్ 19, ప్రభాతవార్త : బిఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కెసిఆర్ మానసపుత్రిక కళ్యాణ లక్ష్మీ పథకం లబ్ధిదారులకు చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే కెపి వివేకానంద పంపిణీ చేశారు. పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో మంజూరైన 202 కళ్యాణలక్ష్మీ చెక్కులలో 50 చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి వివేకానంద మాట్లాడుతూ గత తొమ్మిదేళ్ళ కాలంలో నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా బిఆర్ఎస్ ప్రభుత్వం పాలనను చేపట్టిందన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా పడిన చెక్కుల పంపిణీ కార్యక్రమం నేడు పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారు

**తెలంగాణ ఆటో మోటారు డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య**




చిక్కడపల్లి, డిసెంబరు 19 ప్రభాతవార్త: రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని తెలంగాణ ఆటో మోటారు డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ ఆటో మోటారు డ్రైవర్స్ ట్రేడ్ యూనియన్(టిఎటియు అనుబంధం) ఆధ్వర్యంలో 'ఉపాధి కోల్పోతున్న ఆటో కార్మికుల రక్షణకై పోరాటం' అంశంపై రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్బంగా రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీల పేరుతో తీసుకువచ్చిన పథకంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆటోడ్రైవర్లకు ఉరితాళ్ళుగా మారిందని, ప్రభుత్వం స్పందించి ఆటోకార్మికులకు ప్రత్యామ్నాయం చూపించాలని లేదా ఆటో కార్మికులకు నెలకు రూ.10వేలు జీవనోపాధి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వం స్పందించకుంటే వివిధ రూపాల్లో ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. 27న రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్‌లకు వినతిపత్రాలను ఇవ్వాలని తీర్మానించడం జరిగిందన్నారు.

## కాంగ్రెస్ పార్టీ విస్తృత సమావేశం



సమావేశంలో పాల్గొన్న హనుమంత్‌రెడ్డి

నిజాంపేట్, డిసెంబర్ 19, ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఓటమిపై కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం కొలన్ హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో నిజాంపేట్ మున్సిపల్ కార్పోరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అనంతరం కలన్ హనుమంతరెడ్డి మాట్లాడుతూ ఎవరు కూడా న ఓటమితో అధైర్యపడవద్దని, నా గెలుపు కోసం ప్రతి కార్యకర్త తమశిక్త వంచన లేకుండా పనిచేశారని తెలిపారు. మనం ఇక్కడ గెలవకపోయినప్పటికీ ఇక్కడ ప్రతిపక్షంగా పోరాడుతామని ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని తెలిపారు. ఏ కార్యకర్త నిరుత్సాహ పడరాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో ఇక్కడ మనము అభివృద్ధి సాధిస్తామని రాబోవు ఎన్నికలకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కార్యకర్తలు, సీనియర్ మహిళా నాయకురాలు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తాము

**జోనల్ కార్యదర్శి శంకర్‌రావు**



శంకర్‌రావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న మహిళా ఉద్యోగులు

కంటోన్మెంట్, డిసెంబర్ 19 ప్రభాతవార్త: దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో మజ్దూరన యూనియన్ కేంద్ర కార్యాలయంలో ఏఐఆర్ఎఫ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా మహిళా సమ్మేళనం నిర్వహించారు. విధి నిర్వహణలో మహిళ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు యూనియన్ నాయకుల దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ సందర్భంగా జోనల్ ప్రధాన కార్యాదర్శి శంకర్ రావు మాట్లాడుతూ మహిళ ఉద్యోగుల సంక్షేమం కోసం మజ్దూర్ యూనియన్ రాజీలేని పోరాటం చేస్తుందని అన్నారు. వారి హక్కుల సాధన కొరకు అవిశ్రాంత పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యాక్రమంలో మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్, డివిజనల్ సెక్రటరీ రవీందర్, అసిస్టెంట్ జోనల్ సెక్రటరీలు సరోజిని రెడ్డి, ఉదయ భాస్కర్ బారాటే, డివిజన్ అధ్యక్షుడు ఖాజాబాబ, అసిస్టెంట్ డివిజనల్ సెక్రటరీ స్వామీ, నాగలక్ష్మీ, కోశాధికారి నర్సింహరెడ్డి, సెక్రటరీలు యుగంధర్, రాంమోహన్, వర ప్రసాద్, ఫరూక్, వెల్ఫేర్ ఇన్స్‌పెక్టర్ సరళ కుమారి తదితరులు పాల్గొన్నారు.

## నగర సిపిని కలిసిన ఒయూ ఉద్యోగ సంఘాల నేతలు

తార్నాక, డిసెంబర్ 19 ప్రభాతవార్త: నగర పోలీస్ కమీషనర్‌గా ఇటీవల భాధ్యతలు స్వీకరించిన కొత్తకోట శ్రీనివాస్ రెడ్డిని మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ ఉద్యోగ సంఘాల నేతలు బియ్యాని జ్ఞానేశ్వర్,శంకరయ్య, అశోక్‌కుమార్, నాగరాజరావు, విజయ్‌కుమార్ తధితరులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాకప్పి అభినందనలు తెలిపారు.

## జూన్ 28-30 వరకు ఇన్‌సైడర్ ఎక్స్2024



వివరాలు వెల్లడిస్తున్న పల్లవి అంచూరి తదితరులు

హైదరాబాద్, డిసెంబరు 19,ప్రభాతవార్త: విద్యార్థులకు, రాబోయేవర్ధమాన డిజైనర్లకు తాము నిర్వహించే ఐఐఐడి షోకేస్ ఇన్‌సైడర్ ఎక్స్-2024 వారి ఉన్నతికి దోహదం చేస్తుందని ఐఐఐడి హెచ్‌ఆర్సీ చైర్‌పర్సన్ పల్లవి అంచూరి అన్నారు. ఈమేరకు మంగళవారం జూబ్లీహిల్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఐఐఐడి-హెచ్‌ఆర్సీ ఆధ్వర్యంలో జూన్ 28నుంచి 30వరకు మూడురోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, ఆర్కిటెక్టల కోసం కళలు, చేతిపనులు, విద్యావర్క్ యొక్క ప్రత్యేకమైన సమ్మేళనం ఇందులో ఉంటుందన్నారు.దీనికి దేశవ్యాప్తంగా 3వేలమంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. ముఖ్యంగా ఆర్కిటెక్ట్‌లు, ఇంటీరియర్ డిజైనర్లు, డిజైన్ సంబంధిత వాణిజ్య నిపుణులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ప్రముఖ ఆర్కిటెక్ నిరూప్‌కుమార్‌రెడ్డి, ఎక్స్‌పోకన్వీనర్ రాకేష్‌వాసు, కోకన్వీనర్ నవీన్‌కుమర్ చలసాని పాల్గొన్నారు.

## మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి ఆశీర్వాదం చేసిన అర్చకులు



బేగంపేట డిసెంబరు 19,ప్రభాతవార్త : వైద్య ఆరోగ్యశాఖా మంత్రి దామోదర రాజనర్సింహను మంగళవారం సచివాలయంలో బేగంపేట ప్రకాశంనగర్ శ్రీశ్రీశ్రీ రామలింగేశ్వర దేవస్థానం అర్చకులు మఠం సదాశివుడు మంగళవారం మంత్రిని ఆయన ఛాంబర్ లో కల్సి వేద ఆశీర్వచనం అందజేసారు.ఈ సందర్భంగా ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని,మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుకుంటున్నట్లు మఠం సదాశివుడు తెలిపారు.

## యువతకు భద్రత కాంగ్రెస్ ప్రభుత్వం

**టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్**



ప్లకార్డులతో సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న అధికార ప్రతినిధి చనగాని దయాకర్

తార్నాక, డిసెంబర్ 19 ప్రభాతవార్త: యువతకు భద్రత కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమౌతుందని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ పేర్కొన్నారు. నగరాన్ని డ్రగ్స్ రహిత నగరంగా మార్చుకుందామంటూ ఓ.యూ లైబ్రరీ నుంచి ఆర్ట్స్‌కాలేజ్ వరకు టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆద్వర్యంలో విధ్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రొఫెసర్లు పరిశోధక విద్యార్థులు విద్యార్థి నాయకులు పాల్గొన్నారు. అగ్రికల్చర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, ఆర్ట్స్‌కాలేజ్ ప్రిన్సిపల్ ప్రొ.చింతగణేష్, ప్రొ.అర్జున్ రావు, చనగాని దయాకర్ మాట్లాడుతూ డ్రగ్స్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం డ్రగ్స్‌పై వేసిన సిట్ విచారణ నీరుగార్చిందన్నారు. దశాబ్దకాలంగా యువతను పట్టిపీడిస్తున్న డ్రగ్స్ నిర్మూలనకు పోలీస్ యంత్రాంగానికి ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛ కల్పించడం చాలా మంచి పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ ప్రసిడెంట్ మెడ శ్రీనివాస్, సుమన్ గౌడ్, ఓ.యూ జాక్ రహీం, అంజి గౌడ్, ఏఐఎస్ఎఫ్ సత్య తధితరులు మద్దతు తెలిపారు.

## శబరిమలై వేళ్లే భక్తులకు రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు ఏర్పాట్లు చేయాలి



జాయింట్ యాక్షన్ కమిటి సమావేశంలో పాల్గొన్న అయ్యప్పస్వాములు

అప్జల్‌గంజ్,డిసెంబర్ 19ప్రభాతవార్త:అయ్యపప్ప స్వాములపై జరుగుతున్న దాడులు,శబరిమలైలో స్వాముల ఇబ్బందులను పాలకులు పరిష్కరించాలని అయ్యప్ప ఐక్యవేధిక విజ్ఞప్తి చేసింది.ఉస్మాన్‌గంజ్‌లోని ఏర్పాటు చేసిన సమావేశంలో జాయింట్ యాక్షన్ కమిటి ఐక్యవేధికను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా అయ్యప్ప ఐక్యవేధిక ప్రతినిధులు బుచ్చిరెడ్డిగురు స్వామి, బాలకృష్ణగురుస్వామి, క్యాతం రాధాకృష్ణ గురుస్వామి, ప్రేమ్‌గాంధీ గురుస్వామిలు మాట్లాడుతూ శబరిమలై అయ్యప్ప సన్నిధికి రెండు రాష్ట్రాల నుంచి వేలాది మంది అయ్యప్ప స్వాములు స్వామి దర్శనం కోసం వెళ్తుంటారు.అక్కడి ప్రభుత్వం అయ్యప్ప స్వాములకు సరైన మౌళిక వసతులు కల్పించడంలేదన్నారు.కనుక ఆంధ్రప్రదేశ్,తెలంగాణ రాష్ట్రాల ముఖ్యమం త్రులు ప్రత్యేక చర్యలు తీసుకుని తెలుగు రాష్ట్రాల చెందిన అయ్యప్ప స్వాములకు మౌళిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.కేరళ ప్రభుత్వం కూడా స్వాములకు వైద్య సదుపా యాలు కల్పించాలన్నారు. ఈసమావేశంలో రాజన్ గురు స్వామి, బసవేశ్వర గురుస్వామి, షేరణ్‌దాస్ గురుస్వామి,మురళీగురుస్వామి, శ్రీనివాస్‌గురుస్వామి,సింహం గురుస్వామి పాల్గొన్నారు.

## నియోజకవర్గంలోని కాలనీల నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తా : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



కెమికల్ డంపింగ్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**మన్సూరాబాద్, డిసెంబరు 19 ప్రభాతవార్త :**మార్నింగ్‌వాక్‌లో భాగంగా ఎల్‌బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని హిమ పురి కాలనీ ఫేస్ 1, 2, సెవెన్ హిల్స్, డి.పీ.నగర్, ద్వారకనగర్, ఆటోనగర్ డంపింగ్‌యార్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కాలనీవాసులు మాట్లాడుతూ కొన్నికాలనీలలో నూతనరోడ్లు, డ్రైన్స్, ట్రాన్స్‌ఫార్మర్స్ ఏర్పాటు, కుక్కల బెడద సమస్యలను పరిష్కరించాలని అదే విధంగా ఆటోనగర్ డంపింగ్ యార్డులో వస్తున్న కెమికల్ వాసనతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కెమికల్ వాసన రాకుండా అరికట్టాలని కోరారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీలలో సమస్యలను తప్పకుండా పరిష్కారం చేస్తామని, కెమికల్ వాసన రాకుండా పొల్యూషన్, ఐలా వారికి మరో సారి పిర్యాదు చేస్తామని హామీనిచ్చారు. గతంలో కెమికల్ డంపింగ్‌ను అరికట్టడం జరిగిందని, అలాగే ఈ ప్రాంతంలో గతంలో సెక్యూరిటి ఉండేదని, ఇప్పుడు సెక్యూరిటి లేకపోవడంతో కెమికల్ డంపింగ్ చేయడం జరుగుతుండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు. పొల్యూషన్, ఐలా వారితో మాట్లాడి సెక్యూరిటి సిబ్బందిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా రూ.7 కోట్ల వ్యయంతో స్టామ్ వాటర్ లైన్ మంజూరు చేయడం జరిగిందని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు జక్కిడి మల్లారెడ్డి, నాయకులు జగదీష్‌యాదవ్, బాలరాజు, జగదీష్, మార్గం రాజేష్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు త్వరగా పరిష్కరించాలి: శ్రీవాణి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీవాణి

**ఎల్‌బినగర్, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** డివిజన్లో పేరుకుపోయిన పెండింగ్లో ఉన్న సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. సరూర్‌నగర్ దర్బార్ మన సమస్యలకు పరిష్కారాలు కార్యక్రమం మంగళవారం డివిజన్ వార్డ్ కార్యాలయంలో ఇంజనీరింగ్ విభాగం డిఈ విజయ్, ఏఈ ప్రశాంతిలతో సమావేశం నిర్వహించి డివిజన్లోని పలు సమస్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. అభివృద్ధి పనులు, పెండింగ్ పనులు, సమస్యల గురించి తెలుసుకొని వాటి పరిష్కరించే విధంగా అధికారులు చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనగర్‌కాలనీ జనరల్‌సెక్రెటరీ మందుల శ్రీధర్‌రాజ్, పలు కాలనీల అధ్యక్షకార్యదర్శులు మాధవ్‌రెడ్డి,హనుమంత్‌రాయుడు, శ్రీనివాస్, స్వామిరావు, శ్రీరాములు, మోహనచారి, రాములు, మారయ్య పాల్గొన్నారు.

## రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన తీగల కృష్ణారెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** మీర్‌పేట్ మేడిబౌలిలోని టికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, టికెఆర్ కాలేజీ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే, టికెఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ తీగల కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లో రక్తదానం గొప్పదని, రక్తదానం చేయడం ద్వారా ఇతరులకు ప్రాణదాతలై చిరకాలం గుర్తుండిపోతారని తెలిపారు. అనంతరం రక్తదానం చేస్తున్న యువతను అభినందించారు. ఈ శిబిరంలో సుమారు 300 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కో-ఆర్డినేటర్ విజయ్, టికెఆర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రవిశంకర్, మురళీమోహన్, ఎన్‌ఎస్‌ఎస్ ఇంఛార్జి సునీత తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**సరూర్‌నగర్, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టు భర్తీకి ఆసక్తిగల వారి నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాధిక తెలిపారు. కాలేజీ ఎడ్యుకేషన్ కమీషనర్ కామర్స్ విభాగంలో అతిథి లెక్చరర్ పోస్టు భర్తీకి అనుమతి ఇచ్చారని ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అర్హులైన వారు ఈ నెల 20న సాయంత్రం లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఇంటర్వ్యూ సమయంలో సంబంధిత విద్యార్హత సర్టిఫికెట్లు, బోధన అనుభవం సర్టిఫికెట్లు చూపించాల్సి ఉంటుందని ఆమె తెలిపారు.

## ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి



సంబురాలు జరుపుకుంటున్న విద్యుత్ అధికారులు తదితరులు

**మలక్‌పేట, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని విద్యుత్‌శాఖ ఎస్ఇ అబ్దుల్ రెహామాన్ పేర్కొన్నారు. అస్మాన్‌ఘడ్ విద్యుత్ కార్యాలయంలో సిటి 8 డివిజన్ అస్మాన్ ఘడ్ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ సంబురాలకు ఎస్ఇ రెహ్మాన్, అస్మాన్‌ఘడ్, చంపాపేట, చార్మినార్ డిఇలు హనుమంతరెడ్డి, సురేష్,లింగయ్య, ఫరత్ అలీ, నెహ్రూనాయక్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ అందరి జీవితాలలో వెలుగును ప్రసాదించాలన్నారు. అనంతరం కేక్ కట్ చేసి క్రిస్మస్‌సంబురాలను నిర్వహించి పలు భక్తి గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో రాక్ చర్చి పాస్టర్ బిషప్ తిమోతి, నిర్వాహకులు ప్రేమ్‌విజయ్, జయపుత్ర, తైసిన్ షరీఫ్, విజయ్, రాజశేఖర్, యాదగిరి, అశోక్, అన్నయ్యలతో పాటు అధికారులు వేణుగోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, ప్రీతి, రామకృష్ణానంద్ తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కార్యకర్తలే బలం : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిని సత్కరిస్తున్న మాజీ గంధం జ్యోష్ణ నాగేశ్వర్‌రావు

**రామంతాపూర్, డిసెంబరు 19 ప్రభాతవార్త :** బిఆర్‌ఎస్‌పార్టీ గెలుపుకోసం పని చేసిన ప్రతిఒక్కరికి రుణపడి ఉంటానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు రామంతాపూర్ గాంధీనగర్‌లోని కమ్యూనిటిహాల్‌లో ఎమ్మెల్యేగా బండారి లక్ష్మారెడ్డిని పార్టీ నేతలు ఘనంగా సత్కరించారు. అనంతరం లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో బిఆర్‌ఎస్ గెలుపుకోసం ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పనిచేశారని, వారికి ఎటువంటి సమస్య ఉన్నా పరిష్కరిస్తానని తెలిపారు. బిఆర్‌ఎస్ అధికారంలోకి రాకున్నా కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు సన్నిహితంగా ఉన్నారని, మంత్రి దామోదర్‌రాజనరసింహా తనకు ఎంతో సన్నిహితుడని, పార్టీలకు అతీతంగా ఏ మంత్రి వద్దకైనా వెళ్లి ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉంటానన్నారు. ఎంబిబిఎస్ చదువుకునే విద్యార్థులకు ఉచిత విద్యకు చేయూత అందిస్తామన్నారు. మరో పది రోజుల్లో అన్ని ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తానన్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, తాడూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ గంధం నాగేశ్వర్‌రావు, డివిజన్ అధ్యక్షుడు ముస్తాక్, పాలకూరి శ్రీకాంత్‌గౌడ్, మధుసూధన్‌రెడ్డి, తిప్పని సంపత్, కుమారస్వామి, ముత్యాల నరసింహా, శాగ రవీందర్, సంధ్యారాణి, జానకి, చాపల లోఖ్య, సూరం శంకర్, చాంద్‌పాషా, బోసాని పవన్, జహంగీర్, శ్రీనివాస్‌రెడ్డి, కె.ఎన్.చారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈనెల 22 నుంచి జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు

**ఎల్‌బినగర్, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో రంగారెడ్డి జిల్లా స్థాయి యువజన ఉత్సవాలు ఈనెల 22వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి ప్రకటన విడుదల చేశారు. 27వ జాతీయ యువజన ఉత్సవాల సందర్భంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోఉన్న యువకళాకారులను ప్రోత్సహించడానికి జిల్లా రాష్ట్ర జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడానికి అవకాశం కల్పిస్తున్నామని, జానపద సంగీతం, జానపద నృత్యం, కథ, రచన, పోస్టర్, మేకింగ్, వకృత్వం పోటీ, ఫొటోగ్రఫీ తదితర అంశాలలో పోటీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

## సిసి రోడ్ల నిర్మాణాలు పరిశీలించిన ప్రజాప్రతినిధులు



రోడ్డు పనులు పరిశీలిస్తున్న పారిజాత, శేఖర్, ప్రభాకర్‌రెడ్డి, జైహింద్‌లు

**సరూర్‌నగర్, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ 15, 16 డివిజన్లలో జరుగుతున్న సిసి రోడ్ల నిర్మాణాలను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు 16వ డివిజన్ కార్పొరేటర్ ఎర్ర మహేశ్వరి జైహింద్, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, డిఇఇ జ్యోతి, ఎఇఇ వినీల్‌గౌడ్‌లతో కలిసి రోడ్ల నిర్మాణాలను పర్యవేక్షించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బండారి మనోహర్, నాయకులు బాల్‌నింగని జంగయ్య, పన్నాల రాజేందర్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## శివసాయినగర్‌లో సుబ్రమణ్య షష్టి పూజలు

**సరూర్‌నగర్, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** మీర్‌పేట్ శివసాయినగర్‌లోని శ్రీ గౌరీ నీలకంఠేశ్వర స్వామి సమేత శ్రీ లక్ష్మీ గణపతి దేవాలయంలో శ్రీ సుబ్రమణ్య షష్టి పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితుడు శ్రీకాంతశర్మ, ప్రధాన అర్చకుడు లక్ష్మీగణపతి రావులు భక్తులచే నాగదేవతలకు ఆవు పాలతో అభిషేకాలను భక్తి శ్రద్ధలతో జరిపాంచారు. ఈ కార్యక్రమంలో నరసింహ మూర్తి, రంగనాథ్, బాపిరాజు, గంగా రామకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు వెంకట కృష్ణారావు, వెంకట రమణలతో పాటు పలువురు మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## మహేశ్వరం నియోజకవర్గంలో సేవకురాలిగా పని చేస్తా : ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



భారీ పూలమాలతో సబితా ఇంద్రారెడ్డిని సన్మానిస్తున్న అభిమానులు

**సరూర్‌నగర్, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** మహేశ్వరం అసెంబ్లీ నియోజకవర్గం నుండి మూడవ సారి ఎమ్మెల్యేగా గెలిపించారు.. నాపై నమ్మకంతో బాధ్యత పెట్టారు.. సేవకురాలిగా పని చేస్తూ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మాజీ మంత్రి పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ పెద్దబావి మల్లారెడ్డి గార్డెన్స్‌లో బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ నియోజక వర్గంలో తానుచేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని గమనించి విజయం చేకూర్చిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని వమ్ము చేయకుండా వారి గొంతుకగా మారి బాధ్యతగా పని చేస్తానని ఆమె పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధి, ప్రజాసంక్షేమానికి పాటుపడుతానని ఆమె తెలిపారు. రానున్నది ఎన్నికల కాలమనీ వచ్చే అన్ని ఎన్నికల్లో తన మాదిరిగానే బిఆర్‌ఎస్ అభ్యర్థులందరినీ గెలిపించాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం సబితారెడ్డిని కాలనీ సంక్షేమ సంఘాలు, కాలనీవాసులు, బిఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ అభిమానులు భారీ పూలమాలలు, పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

## సబితారెడ్డి కృషి ఫలితంగానే నేడు రోడ్ల నిర్మాణం: కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** మాజీ మంత్రి,మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అలుపెరుగకుండా చేసిన కృషి ఫలితంగానే నేడు బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ డివిజన్లలో చక్కని సిసి రోడ్లు నిర్మాణం అవుతున్నాయని స్థానిక 24వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డి అన్నారు. డివిజన్‌లోని రాజీవ్ గృహకల్ప సమీపంలోని వైఎస్‌ఆర్ పార్కు వద్ద హెచ్‌ఎండిఎ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనులను మంగళవారం ఆయన స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పనుల కోసం సబితారెడ్డి ప్రత్యేక నిధులు తెచ్చారనీ ఆమె వల్లనే నేడు ప్రజలకు మౌళిక సదుపాయాల కల్పన జరుగుతున్నదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలను ఆదర్శంగా తీర్చిదిద్దుతా : ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి



అంగన్‌వాడీల సమీక్షలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాలను అన్ని సౌకర్యాలతో ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని ప్రీమియర్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడి కేంద్రాలపై టీచర్లు, సిబ్బందితో సమక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడవ సారి ఎమ్మెల్యేగా ఎన్నికై మొదటి ప్రాధాన్యతగా మహిళా శిశు సంక్షేమంపై ఏర్పాటు చేసిన సమీక్ష జరపడం సంతోషంగా ఉందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమంలో అంగన్‌వాడి టీచర్లు, సిబ్బంది భాగస్వామ్యం ఉందని ఆమె తెలిపారు. 23 సంవత్సరాల క్రితం అనుకోని పరిస్థితుల్లో రాజకీయాల్లోకివచ్చిన తనను రాజకీయాల్లో ఏమి సాధిస్తారని అంతా విమర్శించారనీ అయితే తాను పట్టుదలతో ఉంటూ మహిళలు తలచుకుంటే సాధించలేనిది ఉండదని నిరూపించానని ఆమె స్పష్టం చేశారు. అంగన్‌వాడి కేంద్రాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెడతాననీ సెంటర్ల వారీగా నివేదికలు తెప్పించుకొని సమగ్రాభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ముమ్ముందు ఇంకా అభివృద్ధి చేస్తామని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపల్ వైస్ ఛైర్ పర్సన్ ఫర్హానా నాజ్, మహేశ్వరం, హయత్‌నగర్ సిడిపిఓలు, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బందితో పాటు మీర్‌పేట్ కార్పొరేషన్ కార్పొరేటర్ సిద్దాల లావణ్య బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అయ్యప్ప మహాపడి పూజ



అయ్యప్ప మహాపడిపూజలో పాల్గొన్న ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 19 ప్రభాతవార్త :** ఉప్పల్‌లో మహంకాళి రాజు అయ్యప్ప గురుస్వామి ఆధ్వర్యంలో మంగళవారం అయ్యప్ప మహపడి పూజ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జరిగిన పూజ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఎం.పరమేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పరమేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ భక్తి శ్రద్ధలతో అయ్యప్పపూజలు చేయడం అభినందనీయమన్నారు. స్వాములకు తనవంతు సహకారం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా అయ్యప్ప నామస్మరణతో బీరప్పగడ్డప్రాంతం మారుమ్రోగింది. అనంతరం స్వాములకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు మహంకాళి నరసింహా, నేతు బజారు జగన్‌గౌడ్, ఈగ అంజయ్య, పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## సబితమ్మ విజయం సాధించడంపై ఆలయాల్లో పూజలు

**సరూర్‌నగర్, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** అసెంబ్లీ ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గంనుండి సబితా ఇంద్రారెడ్డి ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన సందర్భంగా శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంతో పాటు ఆలంపూర్ జోగులాంబ దేవాలయంలో చండీ హోమం తదితర పూజలు నిర్వహించిన పీఠాధిపతులు, వేద పండితులు నగరానికి వచ్చి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, యువ నేత కార్తీక్‌రెడ్డిలను కలిసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారికి పూజా ప్రసాదాలను అందజేసారు.

## బస్సులో కిందపడి గాయపడిన విద్యార్థిని పరామర్శించిన చిలుక మధుసూదన్‌రెడ్డి

**తుర్కయంజాల్, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ కొహెడ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు "మైలారం జగన్ కుమార్తె దీప" చదువు నిమిత్తం దేశ్‌ముఖి సెయింట్ మేరీ ఇంజనీరింగ్ కళాశాలకు ఆర్టీసీబస్‌లో వెళ్తుంటే ఆర్టీసీ డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో "దీప" కింద పడి గాయాలపాలైంది. దీంతో హయత్‌నగర్ మాక్సిక్యూర్ హాస్పటల్‌లో చేర్పించారు. సోమవారం ఉదయం దీపను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడి పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లని కోరారు. అలాగే హయత్‌నగర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడి న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు.

## పార్కుల అభివృద్ధికి చర్యలు : అరుణ



వాకింగ్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ

**సైదాబాద్, డిసెంబరు 19 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్‌లోని పార్కులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తున్నామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. ఎస్‌బిహెచ్ ఎ కాలనీ పార్కులో నూతనంగా నిర్మించిన వాకింగ్ ట్రాక్‌ను పరిశీలించిన అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లోని పార్కుల్లో అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్, రవి తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి:పన్నాల



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పన్నాల

**నాచారం, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** బ్రహ్మపురి కాలనీ ప్రధాన రోడ్డులో డ్రైనేజీ సమస్య పరిష్కారం కోసం కృషి పనులను ప్రారంభించబోతున్నట్లు కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. సమస్యలను తెలుసుకునేందుకు మంగళవారం స్థానికులు, అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పన్నాల మాట్లాడుతూ డివిజన్‌లోని ఆయా ప్రాంతాల మౌళిక సదుపాయల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. డ్రైనేజీ పనులు పూర్తి అయిన వెంటనే రోడ్డు నిర్మాణం కోసం ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ రూపా, ఏఈ శ్రవంతి, జలమండలి మేనేజర్ సందీప్‌తో పాటు స్థానికులు పాల్గొన్నారు.

## వాహనదారులకు ఇబ్బంది కలిగించవద్దు



పోలీసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**ఎల్‌బినగర్, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** రోడ్డు వెంట వెళ్లే వాహన చోటులకు ఇబ్బంది కలవకుండా చిరు వ్యాపారస్తులు జాగ్రత్తలు వహించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తపేట రైతుబజార్ సర్వీస్ రోడ్డులో విధి వ్యాపారం చేసుకునే వర్తకులను ఎల్‌బినగర్ ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నవీన్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మీరు వ్యాపారం చేసుకునే పనిలో బాగంగా రోడ్డు మీద పోయే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలి అని తెలిపారు. ట్రాఫిక్ విషయంలో ప్రజలు పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయడంవల్ల స్థానిక పోలీసులు మీ మీద చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఒక క్రమపద్ధతిలో వ్యాపారం చేసుకోవాలన్నారు. మీరు ఇబ్బందులు పడకండి, ప్రజలను ఇబ్బందులు పెట్టవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ జితేందర్‌రెడ్డి, కొత్తపేట రైతుబజార్ ఈఓ స్రవంతి, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే అహ్మద్ బలాల



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల

**మలక్‌పేట, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మూసారాంబాగ్ డివిజన్‌లోని సలీంనగర్ సలీంఖాన్ కమ్యూనిటీ హాల్‌లలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడుతున్నాయని అన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రూ.17లక్షలతో సిసి రోడ్డు పనులు : గీత



సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీతప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, డిసెంబరు 19 ప్రభాతవార్త :** చిలుకానగర్ డివిజన్ బాలాజీ ఎన్‌క్లేవ్ కాలనీలో రూ.17లక్షల వ్యయంతో చేపడుతున్న సిసి రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్తగా చేపడుతున్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ బన్నాల గీత అధికారులతో కలిసి పరిశీలించారు. డివిజన్ పరిధిలో గతంలో ఇచ్చిన హామీ మేరకు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. డివిజన్ ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామన్నారు. డివిజన్ పరిధిలో ప్రణాళికబద్దంగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాలనీ నేతలు కార్పొరేటర్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇ రాజ్‌కుమార్, బిఆర్‌ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్, కొండల్‌రెడ్డి, కె.జగన్, కాలనీ నేతలు వేణుగోపాల్‌రెడ్డి, ఓంకార్‌సింగ్, వెంకటేశ్వర్‌రావు, చారి, సాయికుమార్, ప్రకాష్, ఓజా, బాలు, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ 1వ తేదీన చెల్లించాలి : భరత్‌రెడ్డి



పెన్షనర్స్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న భరత్‌రెడ్డి, వినయ్‌కుమార్ తదితరులు

**మలక్‌పేట, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** పెన్షన్ ప్రతి నెల 1వ తేదీన చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు భరత్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు మదన్‌మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి వినయ్‌కుమార్‌లు పేర్కొన్నారు. మలక్‌పేట సలీంనగర్‌లోని తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో పెన్షనర్స్ డేని పురస్కరించుకుని అసోసియేషన్ భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నకరా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్లు అందరూ ఐకమత్యంగా ఉండాలని న్యాయపరంగా రావాల్సిన డిఎలను ఇవ్వాలని కోరారు. న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాస్‌దేవ్, ఓంప్రకాష్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

## హరిహరక్షేత్రంలో ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు

**మలక్‌పేట, డిసెంబర్ 19 ప్రభాతవార్త:** మలక్‌పేట పల్టాన్‌లోని హరిహర క్షేత్రంలో ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఆలయ అర్చకులు మంగళగిరి శ్రీనివాసాచార్యులు, కాసుల చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో నిత్యం స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను వేద మంత్రోచ్చారణల మధ్య నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఛైర్మన్ సూగూరు రమేష్ మాట్లాడుతూ ఈ నెల 23వ తేదీ శనివారం వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని స్వామివారికి అభిషేకం, వైకుంఠ ద్వార దర్శనంతోపాటు తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇఓ జోషి మారా_ండరావు, శెట్టి విజయ్‌కుమార్, సరాపు శ్రీహరి, వనం సత్యేందర్, రొడ్డ రమేష్, రేణు అగర్వాల్, పారిజాతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ నూతన చైర్మన్‌గా ఎన్నికైన కొత్తకుర్మ సత్తయ్యకు అభినందనలు తెలుపుతున్న దృశ్యం (ప్రభాతవార్త, తుర్కయాంజాల్)